# "సెలవు రోజున"

రచన: శ్రీ సింగరాజు రామచంద్రమూర్తి

"ఇదుగో మిమ్మల్నే — ఒక్క సారి లోపలికి రండి" పిలిచింది సావిత్రి తలుపు చాటున నిలబడి.

అప్పడుగుతున్న పెద్దమనిషి గతుక్కుమన్నాడు.

"విన్నావుగా - మా ఆవిడ పిలుస్తోంది. ఇప్పుడే వస్తాను" అన్నాడు వాసు.

అప్పారావు బంగారుగా అతని రెండు చేతులూ పట్టుకున్నాడు. "దాబ్బాబు, నీకు పుణ్యముంటుంది-ముందు జేబులో ఉన్నది ఇటు పడేసిపో" అన్నాడు.

"ఒక్క పది మటుకు ఉందిరా. నీకొక్కపంపింది ముప్పయిగా"

"వినబడిందా? మిమ్మల్నే" హెచ్చరిక వినబడింది.

"వస్తున్నా!"-

"అపదీ ఇటిచ్చివెళ్లు- తరువాత ఉంటే మళ్ళా ఇద్దువుగాని" అని పదిరూపాయలు చేజిక్కించుకుని వెళ్ళిపోయాడు అప్పారావు.

"ఎందుకు పిలిచావు?"

"అతగాడికి మళ్ళీ ఏమీ ఇవ్వక జేబులోది నా చేతికివ్వండి" అంది చిరుకోపంతో సావిత్రి

"ఒక్క పదిమట్టుకు తీసుకు వెళ్లాడు. ఇంకా రెండు...."

"అనుకున్నంతా జరిగిందన్న మాట.. అయినా ఒక మూల గొంతు చించుకుని అరుస్తున్నానాయె - ఏం తొందరవచ్చిందని ఇచ్చేశారు?"

"నేనిచ్చానేమిటి?.... ఉన్నదేమిటో ఇటు పడేసిపో, లోపలికి వెళ్ళేముందు" అన్నాడు వాడు.

"అయితే కనుక్కున్నాడన్నమాట నేనెందుకు పిలిచిందీను. ... ఫ. ఫ మనిషయాక ఒకసారి చెబితే ."

"మరే - వెధవకి బుద్ధిలేదు. ఎన్నిసార్లు చెప్పినా అప్పు అడక్క మానడు."

"అయన్ని కాదు నేనంట!.... మనం సంసారులమా - మార్వాడీలమా ఇలా డబ్బు ఇచ్చుకుంటూ కూర్చోవడానికి? మళ్ళీ వీరందరి దగ్గిర వసూళ్ళకి ప్రాణం పోతుంది.. ఏం మనిషబ్బా!" బుంగమూతి పెట్టి వంటింట్లోకి నిష్క్రమించింది బుసలు కొట్టుకుంటూ.

వాసు తెల్లబోయాడు!

తక్షణం వెళ్ళి ప్రసన్నురాలిని చేసుకోకపోతే వారంపాటు మాటలుండవనీ-మూడు రోజులు పొయ్యిలో నిప్పు పడదనీ అతను అనుభవం మీద ఎరిగిన సత్యం.

"సావిత్రీ, సావిత్రీ - ఎందుకంత కోపం?" పరుగెత్తాడు లోపలికి -సత్యభామ వెంట శ్రీకృష్ణుడిలా.

బిందె ధామ్మంటూ అరుగుమీద పడింది

"చూడు, డబ్బు అవసరం ఎవరికయినా ఉంటుంది, మన కవసరమయితే మనం మట్టుకూ అడగం?"

అడుగుతామంది వంటగిన్నె!

వాసు ఇంకా ధైర్యం వచ్చలేదు "అయినా అప్పిచ్చిన సొమ్ము ఎక్కడికి పోతుంది చెప్పు - బ్యాంకులో వేసినట్టే!.. అహా!" నవ్వుకున్నాడు తన అయిడియాకి,

పప్పుగిన్నెకూడా బాధగా నవ్వింది,

సినిమాలో పాటకు ఉపశ్రుతిలా — ఈ వంటగిన్నెల వాద్యసమ్మేళనంతో ఆ వెనక ఉన్న పాటికర్త కోపానికి భయపడి పూర్తిగా ఓడిపోయాడు వాసు.

"ఏం చెయ్యమంటావో చెప్పు పోనీ!" అన్నాడు శక్తిముందు భక్తుడిలా వినమ్రుడయి.

అయిదు నిముషాలు నిశ్శబ్దం తాండవించింది.

చివరికి "ఇదివరలో మీకు నేను చెప్పటమూ అయింది - మీరు వాటిని గట్టున పెట్టడమూ అయింది" అంది రాజీ ధోరణితో సావిత్రి.

"ఈ సారి అలా కాదుగా! నువ్వు చెప్పినట్టు చేస్తా - నీమీద ఒట్టు - సరా!"

"అయితే వినండి.. "

అతనికి ఒక పీట వేసి తను కింద కూర్చుంది. అర్ధనిమీలిత నేత్రుడై వింటున్నాడు వాసు,

"మొదటిది - మీరు ఈ క్షణం నుంచి ఎవ్వరికీ - ఎ - ప - రి - కీ - అప్పు ఇవ్వ కూ - డ - దు"

"అది కాదు సావిత్రీ - తొందర పడుతున్నావు ఎవరికయినా ప్రాణంమీదకి రావచ్చు. మరెవరికయినా అది కాస్తా పోవచ్చు అటువంటి సమయంలో కూడా మనం సాయం చేయకపోతే...."

"అయితే మీ ఇష్టం!" లేవబోయింది.

బుజంపట్టుకుని ఆపి "అదికాదు నేననేది - ప్రతి నియమానికి కొన్ని 'ఎక్సెప్షన్స్' ఉండాలని"

"ఉండనవసరంలేదు. ప్రాణాలు పోతున్నా సరే - దేముడే అడిగినా సరే - మీరు అప్పివ్వేందుకు విల్లేదు."

"బాగా ఆలోచించుకో!"

"చించాను లెండి. అప్పిస్తే నామీద ఒట్టే!"

"నీమీద ఒట్టు."

"ఇక రెండవది. ఇదివరకు చాలా మందికి ఉన్న అప్పులన్నీ రేపు ఒకటవ తారీఖు కాబట్టి ఒక వారంలోగా వసూలు చేసి నాకివ్వాలి."

"అలాగే!"

" 'అలాగే' అని తలతిప్పటంకాదు. ఈసారి మాట తప్పారంటే..."

''తప్పనుగా.''

సావిత్రి ముఖం చిగిర్చిన మామిడి చెట్టులా అయింది. అది చూసి తను కోయిల అయితే బావుండేదని వాపోయాడు వాసు।

''మీరు చాలా మంచివారండి'' అంది సావిత్రి గోముగా అతని జుత్తులోకి వెళ్ళ పోనిస్తూ।

''ఔను సుమీ!'' అనుకున్నాడు ఛాతీ అయిదంగుళాలు పెంచి.

పిండివంటలతో సహా భోజనం ముగించి వరండాలోకి చేరుకున్నాడు వాసు తన ముందు చూపువలన ఒక పెద్ద టుఫాను తప్పిందన్న హుషారులో ఉన్నాడు।

ఇంతలో సుడిగాలిలా లోపలికి దూసుకొచ్చాడు విశ్వం.

"ఏనుండోయ్ బావగారూ ఇలా కొట్టుకొచ్చారు.... సావిత్రి మీ అన్నయ్య వేం చేశాడు, కూర్చోవయ్యా మహానుభావా!" అంటూ ఆహ్వానించాడు వాసు.

ఇంటిపనులు అప్పుడే ముగించుకున్న సావిత్రి - హడావుడిగా పమిట చెంగుకి చేతులు తుడుచుకుంటూ వచ్చింది

"అర్జంటుగా ఒక్క ఎందరూపాయలు సర్దాలోయ్ బావా'' అన్నాడు విశ్వం నిలబడే - కూర్చుంటే వేడిపోతుందని।

నిలువునా పిడుగు పడినట్లయింది సావిత్రికి.

వాసు ఆశ్చర్యపోయాడు।

"అప్పా, ఏదీ - అప్పు - లోను "

"అక్షరాలా "అప్పు" అందులోనూ ఒక్క వంద మట్టుకు" వాసుకి కాఫీ తాగి సిగిరెట్టు తాగుతున్న వాడంత హుషారొచ్చింది. "ఏమంటావు" అన్నట్లు సావిత్రి వంక చూశాడు.

చేష్టలుడిగి తెల్లబోయి నుంచుంది సావిత్రి,

"ఏమిటోయ్ అలా ముఖాలు చూసుకుంటావు? నీ దగ్గర డబ్బులేదని మటుకు అనకు- దారిలో అప్పారావు కనబడి ఇప్పుడే నవ్వాక వది ఇచ్చావని ఇంకో నలభయి ఇస్తానంటే తనే అక్కర్లేదన్నానని చెప్పాడు''

వాసుకి నవ్వొచ్చింది.

"అహం సరేం లేదు- మీ చెల్లెలు. " అంటూ మాట నాన్చేసి మళ్ళీ సావిత్రి వంక చూశాడు,
గిరుక్కున తిరిగి ఇంట్లోకి వెళ్ళిపోయింది సావిత్రి.

''వస్తానుండు'' అని చెప్పి లోపలికి వెళ్ళాడు వాసు.

మంచంమీద బోర్లా పడుకుని దిండులో తలదూర్చేసింది సావిత్రి.

''ఏం సావిత్రీ, ఇవ్వమంటావా?'' అనడిగాడు.

''మీ ఇష్టం'' అంది ఎటూ చెప్పలేక. సమాధానంలోని సౌమ్యత ఇష్టే గ్రహించి- ఆమె పరిస్థితిని అర్థం చేసుకున్నాడు వాసు.

''అవును పాపం ఎలా చెబుతుంది- ఒక వైపు అభిమానం మరో వైపు అన్నగారు!' అనుకున్నాడు మారు మాట్లాడకుండా ఎందరూపాయలు తీసుకెళ్ళి బావమరిది కిచ్చాడు.

"థాంక్స్। అసలు విషయం తరువాత చెబుతాలే" అంటూ వెళ్ళిపోయాడు విశ్వం

"పాపం సావిత్రి ఎంత బాధపడిందో ఈ అనుకోని సంఘటనకి ..ప్చ్" అనుకుంటుండగానే చెప్పులు వేసుకుని సావిత్రి బయటికి వచ్చింది,

కళ్ళు, ముక్కు ఎర్రబడి ఉన్నాయి।

"మా అన్నయ్యగారింటికి వెడుతున్నాను'' అంటూనే మెట్లుదిగి వెళ్ళిపోయింది సావిత్రి.

వాసు మ్రాన్పడిపోయాడు। అక్కడేమయినా హడావుడి జరుగుతుందేమోనని భయపడ్డాడు ... అయినా కొట్టుకున్నా, తిట్టుకున్నా వాళ్ళూ వాళ్ళూ ఒకటవుతారు. ఆ రంగంలోకి తన పోవడం బావుండదన్న ఉద్దేశ్యంతో కుర్చీలో కూలబడి పేపరు ఘడామడా చదవసాగాడు,

ఒక గంట గడిచి వాసుకి కునుకు పడుతుండగా చిలచిల్లాడుతూ సావిత్రి, విశ్వం- అతని భార్య వసంతా వచ్చారు లోపలికి.

"ఇదుగో బావగారూ, మొత్తానికి ఈ రోజు మగాళ్ళ విజయ దినం. మీకు నా కంగ్రాట్సు'' అంటూ చేయిపట్టుకుని ఒక్క ఊపు ఊపాడు విశ్వం.

సావిత్రి ముఖం కళకళ లాడుతోంది।
పరిస్థితి అర్థం కాలేదు వాసుకి
" అసలు ఏంజరిగింది?'' అనడిగాడు సావిత్రిని.

" రోజు ఇంట్లో రోజు కదండీ - అందుకని తోచక మాటమీద మాటొచ్చి మా అన్నయ్యా, వదినా పందెం వేసుకున్నారట "ఊరికిందా పలుకులకి బోలెడుఉందని ఊరికే గొప్పకేంలు పెడతారు. ఒక అరగంటలో మీరు ఎందరూపాయలు పుట్టించుకు రండి చూద్దాం!" అందిట మా వదిన. వాడు నేరుగా మీ దగ్గరకు వచ్చి అడిగాడు తరువాత విషయం తెలుగా। . పందెం వేసిన పావుగంటలోనే - అందునా నెలాఖరు రోజున - డబ్బు చూపించేసరికి మా వదిన బెల్లబోయి ఓటమిని ఒప్పుకుంది. మొత్తానికి మా అన్నయ్య గెలిచి వదిన నోటికి తాళం పడింది - అంతేచాలునాకు'' అంది సావిత్రి సంతృప్తిగా.

వాసంతి మటుకు తక్కువ తిందా?

''మా అన్నగారి దగ్గర నువ్వు ఓడిపోయావుగా। ఆయనకి నీతులుచెప్పి ప్రమాణాలు చేయించుకున్నావు, తీరా మీ అన్నయ్యే వచ్చి అప్పు అడగటంతో కాదనలేక ఇవ్వద్దనలేక పోయావు. నీ బాధ గ్రహించి- మీ ఇద్దరినీ దయతలచి ఆయన ఇచ్చారు కాబట్టి సరిపోయింది కాని- నువ్వు ఓడిపోయావు. నాకూ అదే చాలు।" అని నవ్వింది వాసంతి.

మిగిలిన ముగ్గురూ కూడా నవ్వేశారు।

ఆ రోజు వాసు స్నేహితులకి చిరస్మరణీయమయినది.

---